కూలేలోపు కళ్లు తెరిచేరా!


పూర్తిగా దెబ్బతిన్న దేవపట్ల పశువైద్యశాల

నూతన భవనం మంజూరు చేయాలంటున్న పాడిరైతులు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల పశువైద్యశాల కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పై భాగాన పెచ్చులూడి కడ్డీలు బయటపడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షానికి భవనంలో నీరు కారి మందులు, రికార్డులు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. నిత్యం పెద్దసంఖ్యలో పాడి రైతులు తమ పశువులను ఇక్కడికి తీసుకువచ్చి చికిత్సలు చేయిస్తుంటారు. పూర్తిగా దెబ్బతిన్న భవనంలో ఎప్పుడు ఏ పెచ్చు ఊడి ఎక్కడ పడుతుందోనన్న భయాందోళనలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. పాడి రైతులు సైతం కార్యాలయ పరిస్థితి చూసి ఆవేదన చెందాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా ఉన్నతాధికారులు, పశు వైద్య శాఖ ముఖ్య అధికారులు నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.


పెచ్చలూడి కడ్డీలు బయటపడిన స్లాబ్

క్లుప్తంగా

రేపు మట్టి వినాయకుడి విగ్రహాలు పంపిణీ

రాజంపేట టౌన్ : ఈనెల 27వ తేదీన వినాయక స్వామి పండుగను పురస్కరించుకొని మంగళవారం ఉదయం 10 గంటలకు సాయినగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద, మన్నూరు మెయిన్ రోడ్డులో ఉన్న రామాలయం వద్ద ఉచితంగా మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు సాయినగర్‌కు చెందిన సుంకర సుబ్బరాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగనపల్లె వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయినగర్‌లో సుబ్బరాయుడు, మన్నూరులో గంగనపల్లె వెంకటరమణ, హైమావతి దంపతుల చేతులమీదుగా విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ఈ బృహత్తర కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఊపందుకున్న కొనుగోళ్లు


బెస్తపల్లిలో అమ్మకానికి సిద్ధంగా గణనాథులు

పెనగలూరు : వినాయక చవితి దగ్గర పడుతున్న నేపథ్యంలో వినాయక ప్రతిమల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మండలంలోని బెస్తపల్లి వద్ద విక్రయదారులు ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని మట్టి కాగితాలతో కలిపిన వెయిట్‌లెస్ విగ్రహాలను తయారు చేయించినట్లు అమ్మకందారులు తెలియజేశారు. ఈ విగ్రహాలు ఇద్దరు మనషులు మోసే అంతటి బరువు మాత్రమే ఉంటాయని అన్నారు. ఈ విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. గతంలో విగ్రహాలు కొనాలంటే మండలం నుంచి రాజంపేటకు వెళ్లి కొనుగోలు చేసేవారని చెప్పారు.

ధానధర్మాలు వ్యక్తి కీర్తి, ప్రతిష్టలను పెంచుతాయి


పెన్షన్లను పంపిణీ చేస్తున్న క్వారీ సుబహాన్

ఒంటిమిట్ట : ధాన ధర్మాలు వ్యక్తి కీర్తి, ప్రతిష్టలను పెంచుతాయని జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు అధినేత క్వారీ అబ్దుల్ సుబహాన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మదరసాలో ఆయన ఆదివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కులమతాలకు అతీతంగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సహాయం చేయడం వల్ల ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారిని ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు. సెప్టెంబర్ 28, 29వ తేదీలలో మదరసా ప్రాంగణంలో ఇస్తిమా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లి గ్రామానికి చెందిన నరసింహయాదవ్ కుమారుడి వివాహం అనంతరం వారి స్వగృహం నందు నూతన వధూవరులను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆశీర్వదించారు. ఆయనతో పాటు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్ యాదవ్, మండల కన్వీనర్ గుండు మల్లికార్జునరెడ్డి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, మధుయాదవ్, మాహబూబ్ బాషా, పుత్తా సుధాకర్, చిన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివాహ రిసెప్షన్‌కు హాజరైన కొరముట్ల


మండల నాయకులతో కలిసి రిసెప్షన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : వైకోట గ్రామ మైనార్టీ నాయకులు, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా తమ్ముడి వివాహ రిసెప్షన్‌కు ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లి, రైల్వేకోడూరు, చిట్వేలి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి కృష్ణారెడ్డి, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, మాజీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర, సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, మైనార్టీ నాయకులు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో దోపిడీకి చెక్!

- అక్రమాలను తగ్గించేందుకు ఎన్ఎంఎస్ఎస్ యాప్
- కూలీల ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి
- బోగస్ మస్టర్లు లేకుండా కేంద్రం చర్యలు



మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గాలివీడు : ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. క్షేత్రస్థాయిలో జరిగే పనులకు అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఉపాధి ఫలాలను అర్హులకు అందించాలనే సంకల్పంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎస్ఎస్) పేరుతో నూతన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ప్రారంభిస్తోంది. దీంతో బినామీ, బోగస్ మస్టర్లతో ఉపాధి నిధుల స్వాహాకు చెక్ పడనుంది. ఉపాధి హామీ పథకంలో బోగస్, బినామీ మస్టర్లతో క్షేత్ర సహాయకులు, నాయకులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేస్తుండడాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అత్యాధునిక సాంకేతికతతో ఎన్ఎంఎస్ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను గ్రామ, మండల, జిల్లా భౌగోళిక పరిస్థితిని సైతం అంచనా వేసేలా రూపొందించారు. ఇందులో గ్రామాల్లో చేపడుతున్న పనులకు సంబంధించిన ఫొటోలను ప్రతిరోజూ అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే జాబ్ కార్డు కలిగిన వేతనదారుల ఫొటోలను ముందస్తుగా అప్‌లోడ్ చేస్తారు. ఉపాధి పనులకు వేతనదారులు హాజరైన సమయంలో యాప్ ద్వారా ప్రతి ఒక్కరి ఫొటో తీయాలి. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోతో మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ ప్రక్రియలో ఒకరి బదులు మరొకరు పనులకు రాకుండా ఉండేలా తోడ్పడుతుంది.

కేంద్రం ఆదేశాలతో..

గాలివీడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మొత్తం 18000 జాబ్ కార్డులు ఉండగా, వీటిలో 12 వేల మంది వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎన్ఎంఎస్ఎస్ యాప్ ద్వారా పనులు చేపడుతున్నారు. ఏపీఓలు పనులు జరిగే ప్రాంతాల్లోని వేతనదారులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలి.

హాజరు నమోదు ఇలా

ఉపాధి వేతనదారులు హాజరు తీసుకునేలా వేతనదారుల ఫొటోలను మొబైల్ ద్వారా తీసుకొని ఎన్ఎంఎస్ఎస్ అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో రోజుకు రెండు సార్లు క్షేత్ర సహాయకులు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ సమయంలో ఒకరికి బదులు మరొకరు హాజరు చూపితే ఆన్‌లైన్‌లో వేతనదారుల హాజరు తీసుకోదు.

నగదు చెల్లింపులు ఉండవు

ఉపాధి పనులకు వేతనదారులు హాజరైన సమయంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి అప్‌లోడ్ చేస్తే నాలుగు గంటల తర్వాత అంటే ఉదయం 10 గంటలకు మరోసారి ఫొటోను అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఉదయం 6 గంటలకు తీసిన ఫొటోతో పాటు 10 గంటలకు తీసిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి. అలా చేయకపోతే ఆరోజు వేతనదారులకు నగదు చెల్లింపులు ఉండవు. గతంలో వేతనదారులు పనులకు రాకపోయినా మస్టరు వేయడం, తమ బంధువుల పేర్లు నమోదు చేసి వారు పనులకు హాజరుకాకపోయిన నగదు తీసుకుంటూ దోచుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ కొత్త యాప్ ద్వారా వాటిని నిలువరించే అవకాశం ఉంటుంది. ఈ యాప్ ద్వారా అటు నాయుకులు, ఇటు క్షేత్ర సహాయకులు అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం వేతనదారులకు కొత్త యాప్ విధి విధానాలపై అవగాహన కల్పిస్తున్నాం. రోజుకు రెండు సార్లు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. వేరే వాళ్లు పనిచేస్తే నగదు రాదు. క్షేత్ర సహాయకులు బాధ్యతగా పనిచేయడంతో పాటు రెండుసార్లు తీసిన ఫొటోలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇప్పటికే గ్రామాల్లో ముఖ ఆధారిత యాప్ ద్వారా హాజరు తీసుకుంటున్నాము. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో అమలు చెయ్యడం జరుగుతుంది. గాలివీడు మండలంలో తూముకుంట, పందికుంట గ్రామాల్లో సిబ్బంది ఫొటోలు సరిగ్గా తీయనందున మళ్లీ తీసి పంపించమన్నాం.
>
> – వెంకతరత్నం, డ్వామా పీడీ, అన్నమయ్య జిల్లా

పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

రాజంపేట టౌన్ : ప్రభుత్వ పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆర్.రాజగోపాల్‌రెడ్డి, తిరుపతిజిల్లా కెఆర్.శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సభా భవనంలో ఆదివారం నిర్వహించిన పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా పెన్షనర్లకు రావాల్సిన డీఏ, పీఆర్సీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెన్షనర్లందరూ వృద్ధాప్యంలో ఉన్నందున ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఎక్కువ డబ్బు ఖర్చవుతోందని అందువల్ల ప్రభుత్వం తమ సమస్యను మానవీయ కోణంలో ఆలోచించాలని కోరారు. కొంతమంది పెన్షనర్లకు పెద్ద జబ్బులు చేసినప్పుడు ఆర్థిక పరిస్థితుల కారణంగా సరైన వైద్యం చేయించుకోలేక మృత్యువాత పడినవారు కూడా ఉన్నారన్నారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం మంజూరు చేస్తే వృద్ధులకు, మృతి చెందిన పెన్షనర్ల కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.గోపాల్, డాక్టర్.ఎస్.రామచంద్రయ్య, వేణుగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నూతన అధ్యక్షుడిగా వేణుగోపాల్‌నాయుడు

పెన్షనర్ల అసోసియేషన్ రాజంపేట మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా లావనూరు శ్రీనివాసులు, అధ్యక్షులుగా బాసినేని వేణుగోపాల్‌నాయుడు, సహాధ్యక్షులుగా ఎస్వీ.రాజేశ్వరరావు, ఎ.భాస్కర్‌రాజు, ఉపాధ్యక్షులుగా బి.నారాయణ, ఎస్.చెంగల్‌రాజు, ఈ.రామచంద్ర, కె.పోలయ్య, ప్రధానకార్యదర్శిగా అరవ ఉమామహేశ్వర్‌రావు, కార్యదర్శులుగా పి.అక్షిత, ఎస్.విజయకుమారి, ఎల్.చంద్రయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.సుబ్బనరసయ్య, కోశాధికారిగా ఎం.సత్యనారాయణను ఎన్నుకున్నారు.

సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి సేవలు అమోఘం

నందలూరు : సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ నాయకులు రవిశంకర్‌రెడ్డి సేవలు అమోఘం అని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ అల్లం అశోక్‌కుమార్ పేర్కొన్నారు. నందలూరు మండలం నుంచి పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన రవిశంకర్‌రెడ్డిని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ రవిశంకర్‌రెడ్డి ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు సంబంధించిన విషయాలు అయితేనేమి ఉపాధ్యాయుల సమస్యలు తీర్చడంలోనైతేనేమి తన వంతు కృషి చేశారన్నారు. ఆయన సేవలు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు షఫీవుల్లా, కార్యదర్శి లీలాకృష్ణయ్య, జిల్లా నాయకులు మోహన్‌రాజు, మహేశ్వరబాబు, నరసింహారావు, వెంకటరమణ, ఓబుల్, సంధాని, సుస్మితా, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.


రవిశంకర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

ఉపాధ్యాయుడిగా సహదేవ రెడ్డి సేవలు అభినందనీయం

లక్కిరెడ్డిపల్లి : ఉద్యోగరీత్యా ఉపాధ్యాయులు సహదేవరెడ్డి సేవలు అభినందనీయమని లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, రామాపురం మాజీ ఎంపీపీ గడికోట ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సోదరుడు సుదీప్ కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. గాలివీడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న సహదేవరెడ్డి పదవీ విరమణ అనంతరం లక్కిరెడ్డిపల్లి పీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో సహదేవరెడ్డి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతస్థాయికి చేరుకునేలా విద్యాబుద్ధులను నేర్పించడంలో తనవంతు మన్ననలు పొందారని కొనియాడారు.


సహదేవరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తదితరులు

పూజలందుకున్న శక్తి స్వరూపణిలు


చిన్నమండెం: ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ


సంబేపల్లె: భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ


సుండుపల్లె: అభయం ప్రసాదిస్తున్న నాగారపమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మొక్కులు తీరిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీనాగారపమ్మను ఆదివారం పూజారులు పట్టువస్త్రాలు, పూలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువైన శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

యోగాతో ఆరోగ్యం.. శారీరక దృఢత్వం


సిద్దవటం: బెటాలియన్ క్యాంపస్‌లో అధికారుల సైకిల్ ర్యాలీ


రాయచోటి టౌన్: సైక్లింగ్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

సిద్దవటం : యోగాతో ఆరోగ్య.. శారీరక దృఢత్వం కలుగుతుందని 11వ ఏపీఎస్పీ బెటాలియన్ కామండెంట్ కె.ఆనందరెడ్డి అన్నారు. ఆదివారం యోగా అభ్యసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యోగా విశిష్టత, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి సైకిల్ ర్యాలీ తీశామన్నారు. సైకిల్ వాడకం ద్వారా శరీరానికి దృఢత్వం, ఫిట్నెస్ పొందవచ్చన్నారు. ఆరోగ్యకరమైమన, కాలుష్య రహిత జీవన విధానానికి ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందన్నారు. సైక్లింగ్, యోగా అభ్యాసనాల ద్వారా ఆరోగ్యాన్ని సమర్థవంతంగా ఉత్సాహ భరితమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో ప్రధానపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, ఆర్ఐ, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

రాయచోటి టౌన్ : అందరూ ఆరోగ్యంగా ఉండాలి.. అందుకు ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని రాయచోటి డీఎస్పీ యం.ఆర్.కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పోలీస్ శాఖ కార్యాలయం నుంచి ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పోలీసులు తప్పకుండా ప్రతి ఆదివారం సైక్లింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు. సైక్లింగ్ చేయడం వలన శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు కృషి చేయాలని తెలియజేశారు.

'లంకమల'లో కూంబింగ్

సిద్దవటం : లంకమల అభయారణ్యంలోని సమస్యాత్మక ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజ్ అధికారిణి కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం అటవీ ప్రాంతంలోని రోళ్లబోడు, గొల్లపల్లి, సిద్దవటం బీట్‌లలో కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతాలకు సమీప పొలాలలోకి వన్యప్రాణులు సంచరిస్తే వాటికి ఎటువంటి ప్రాణహాణి తలపెట్టకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేస్, అటవీ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

గంగనపల్లికి సత్కారం



నందలూరు : తెలుగు భాషా సాహిత్యానికి విశేష కృషి చేస్తున్న నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ కడప సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఘన సత్కారం అందుకున్నారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యూపీపీ) ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలను నిర్వహించారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి తెలుగులో నూటికి నూరు మార్కులు సంపాదించేలా చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆర్‌యూపీపీ రాష్ట్ర బాధ్యులు శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు.

అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు

లక్కిరెడ్డిపల్లి : యూరియా, ఎరువులపై ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై సిక్స్-ఏ కేసులు నమోదు చేసి లైసెన్సులను క్యాన్సిల్ చేయడం జరుగుతుందని విజిలెన్సు సీఐ నారాయణ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని గణేష్ ట్రేడర్స్, రైతు మిత్ర ఆగ్రోస్, జనతా ఫర్టిలైజర్స్ దుకాణాలను సీఐ నారాయణ, కానిస్టేబుల్ యుగంధర్, మండల వ్యవసాయ అధికారిణి జి.రాజకుమారితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు దుకాణం డీలర్‌ల లైసెన్సు వివరాలు, స్టాక్ రిజిస్టర్, ఎరువులకు సంబంధించిన అన్ని వివరాలను తనిఖీ చేసి రూల్స్‌కు వ్యతిరేకంగా గానీ లేక బిల్లు ఇవ్వకుండా రైతులకు ఎరువులను అమ్మటం కానీ సరైన రికార్డులు నిర్వహించకపోతే అటువంటి డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ తెలియజేశారు. ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ తనిఖీలలో వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, విజిలెన్సు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి గ్రామంలో వెలసిన వెంకయ్య స్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం గ్రామ పెద్దల సహకారంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం వెయ్యిమంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకారంలో వెంకయ్య స్వామి

నూతన కార్యవర్గం ఎన్నిక

రాయచోటి టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా గౌరవా అధ్యక్షులుగా సుంకర రామకృష్ణ, అధ్యక్షులుగా కానాల నాగమునిరెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎం.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా వై.వెంకటరమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జయన్న, హెడ్ క్వార్టర్ సెక్రటరీగా ఎం.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా టి.గంగాధర్, ఎం.సుబ్బారెడ్డి, డి.సుబ్బరాయుడులను ఎన్నుకున్నారు. మహిళ ప్రతినిధులుగా చంద్రకళ, జీపీ సుధారాణి, రాయచోటి డివిజన్ అధ్యక్షులుగా బి.రెడ్డెన్న, కార్యదర్శిగా వై.సురేంద్ర, మదనపల్లె డివిజన్ అధ్యక్షులుగా ఎం.మోహన్ నాయుడు, కార్యదర్శిగా రామచంద్ర, రాజంపేట డివిజన్ అధ్యక్షులుగా బి.రఘురాం, కార్యదర్శిగా సీవీ రమణయ్య శెట్టిలను ఎన్నుకున్నారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా రఘు, లీగల్ కమిటీ సభ్యులుగా బి.వెంకటరమణ నాయక్, బి.అమ్ముగనాయక్‌లను ఎన్నిక చేశారు. ఈ ఎన్నికల పరిశీలకుడిగా చిత్తూరు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జనరల్ సెక్రటరీ సురేష్ కుమార్ వ్యవహరించారు.

ఆవుల వేణుగోపాల్‌రెడ్డి ప్రజా జీవితం ఆదర్శనీయం




ఆవుల వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజంపేట, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు ఆకేపాటి, ద్వారకనాథ్‌రెడ్డి, నాయకులు

> దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళి అర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సంబేపల్లె : ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆవుల వేణుగోపాల్‌రెడ్డి అని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లె వేణుగోపాల్‌రెడ్డి దశదిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆవుల కుటుంబ సభ్యులైన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డిలను పరామర్శించారు.

విద్యా, వైద్య రంగంలో..

దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాపనలో ఆవుల వేణుగోపాల్‌రెడ్డి, వారి తండ్రి ఆవుల కొండారెడ్డి చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. అప్పట్లో గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందాలన్న ఆశయంతో వారు మొదలు పెట్టిన ప్రయత్నం నేడు వేలాది మంది ప్రజలకు చికిత్స అందించే స్థాయికి చేరుకుందన్నారు. అలానే దేవపట్ల ప్రభుత్వ పాఠశాల, మిట్ట సమీపంలో బాలికల పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సహించడంలో వేణుగోపాల్‌రెడ్డి అవిశ్రాంతంగా శ్రమించాడన్నారు. కాగా హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు దేశాయి తిప్పారెడ్డి, ఆర్.రమేశ్ కుమార్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, ఏపీపీ చిదంబర్‌రెడ్డి, వెన్నపూస రవీంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సరేష్‌కుమార్, మదనపల్లె వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ నిస్సార్ అహమ్మద్, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ డీఓపీ జిల్లా సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు, నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.